క్లుప్తంగా

మెనూ పాటించాలి



మధ్యాహ్న భోజన వంటలను పరిశీలిస్తున్న ఎంఈఓ జగదీశ్వరరావు

వేపాడ: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ జగదీశ్వరరావు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు సూచించారు. మండలంలోని దబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ముందుగా విద్యార్థుల హాజరు, వర్క్‌బుక్స్ పరిశీలించారు. విద్యార్థులతో పాఠాలు చదివించి వారి విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు.వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని హెచ్ఎం శంకరరావు, ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

విచారణ



విచారణ చేస్తున్న తహసీల్దార్ రాములమ్మ

వేపాడ: బొద్దాం గ్రామంలో గతంలో ఆరుగురు అనర్హులకు గృహాలు మంజూరు చేశారని సర్పంచ్ ఎర్రా రామసత్యవతి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు హైకోర్టులో కేసు వేశారు. కోర్టు ఆదేశాలమేరకు తహసీల్దార్ రాములమ్మ, ఆర్ఐ రామలక్ష్మి గ్రామంలోని సచివాలయంలో సర్పంచ్ రామసత్యవతి సమక్షంలో ఇళ్ల లబ్ధిదారులను మంగళవారం విచారించారు. వారి వద్ద నుంచి స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నామని తహసీల్దార్ తెలిపారు.

రామన్నపేటలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారి సుష్మ

గజపతినగరం: మండలంలోని రామన్నపేట గ్రామంలో మంగళవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ, వైద్యసిబ్బంది 79 మందికి వివిధ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసి, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

జాబ్ కార్డులున్న వారందరికీ పనికల్పించండి



ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశమైన ఇన్‌చార్జి ఎంపీడీఓ సురేష్

చీపురుపల్లి: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులను కల్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ, ఉపాధిహామీ పథకం పీఓ ఐ.సురేష్ సిబ్బందికి సూచించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనుల నిర్వహణపై ఉపాధిహామీ పథకం సిబ్బందితో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వేతనదారులందరికీ పని కల్పించేందుకు దాదాపు 611 పనులను ఎంపిక చేశామని, 3 లక్షల పనిదినాలను కేటాయించినట్లు చెప్పారు. మరో 2 లక్షల పనిదినాల కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు. మండలంలోని ప్రతీ పంచాయతీలో వేతనదారులు పనిదినాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని, వ్యవసాయ అనుబంధ పనులు మాత్రమే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పారంపాండ్స్, ఫిష్ పాండ్స్, ట్రెంచ్ వర్క్స్, ఛానల్స్ తదితర పనులు నిర్వహించుకునే విధంగా క్షేత్ర స్థాయిలో సిబ్బందికి సూచనలు ఇవ్వాలన్నారు.

బొంతలకోటికి జాతీయ పురస్కారం



బొంతల కోటి శంకరరావుకు అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, తదితరులు

గజపతినగరం: విద్య,సామాజిక, సాహిత్య రంగాల్లో సేవలందిస్తున్న మండలంలోని పురిటిపెంట న్యూకాలనీలో నివాసం ఉంటున్న మెంటాడ మండలంలోని గుర్ల తమ్మిరాజుపేట హైస్కూల్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు బొంతలకోటి శంకరరావును డాక్టర్ కొణతాల రామలింగస్వామి జాతీయ పురస్కారం వరించింది. అనకాపల్లిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కొణతాల రామలింగస్వామి ట్రస్ట్ సభ్యుల చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. గజపతినగరం,పురిటిపెంట వాసులతో పాటు గుర్ల తమ్మిరాజుపేట హైస్కూల్ సిబ్బంది బొంతలకోటికి అభినందనలు తెలిపారు.

బైపాస్.. రైట్ రైట్



చీపురుపల్లి- రాజాం రోడ్డు నుంచి మెరకముడిదాం మండలానికి ఏర్పాటు చేసిన బైపాస్ రోడ్డు

- తొలగిన జి. అగ్రహారం వాసుల కష్టాలు
- చీపురుపల్లి- రాజాం రోడ్డు నుంచి మెరకముడిదాం మండలానికి రోడ్డు నిర్మాణం
- వైఎస్సార్‌సీపీ హయాంలోనే నిధులు మంజూరు
- రూ.8.76 కోట్లతో పూర్తయిన 14.90 కిలో మీటర్ల రోడ్డు
- అందులోనే అగ్రహారం బైపాస్ బీటీ రోడ్డు

చీపురుపల్లి: నివాసాల మధ్య నుంచి రోజూ వందల సంఖ్యలో చిన్న, భారీ వాహనాల రాకపోకలు... వీటి వల్ల వచ్చే విపరీతమైన దుమ్ము ధూళితో ఇళ్లలో ఉంటున్నామా లేక ఊరి బయట ఉంటున్నామో తెలియని పరిస్థితి చీపురుపల్లి మేజర్ పంచాయతీలోని జి.అగ్రహారం వాసులది. నియోజకవర్గ కేంద్రమైన చీపురుపల్లి పట్టణంలోని జి.అగ్రహారం ఊరిలో నుంచి మెరకముడిదాం మండలంలోని వెదుల్ల వలస, బిళ్లలవలస, సోమలింగాపురం, గోపన్నవలస, ఘాతాడ, కొర్లాం, గర్భాంతో పాటు మెరకముడిదాం మండల కేంద్రానికి ప్రధాన రహదారి సౌకర్యం ఉంది. ద్విచక్ర వాహనాల నుంచి కార్లు, ట్రాక్టర్లు, లారీలు వంటి వాహనాలు నిత్యం జి.అగ్రహారం నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే చీపురుపల్లి మండలంలోని ఆకులపేట, గరివిడి మండలంలోని కుమరాం, పాలవలస, బాగువలస, ఆవగూడెం, మందిరవలస తదితర గ్రామాలకు చెందిన వారు ప్రయాణాలు సాగిస్తుంటారు. దీంతో ఇళ్లలోకి విపరీతమైన ధూళి ఎగసిపడుతుండడం,ఊరు మధ్య నుంచి వాహన రాకపోకలతో అగ్రహారం వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. తమ ఊరిలో నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా ఉండేందుకు బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలంటూ ఆ ప్రాంత వాసులు గత ప్రభుత్వంలో అప్పటి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి వారు స్పందించి బైపాస్ రోడ్డు ఏర్పాటుకు హామీ ఇచ్చారు. చీపురుపల్లి నుంచి వెదుల్లవలస, బిళ్లలవలస మీదుగా మెరకముడిదాం మండలంలోని గర్భాం వరకు 14.90 కిలో మీటర్ల పరిధిలో బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.8.76 కోట్లు నిధులు మంజూరు చేయించా రు. అదే సమయంలో ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అందులోనే అగ్రహారం బైపాస్ రోడ్డు కూడా ఏర్పాటు చేయాలని అధికారులతో చర్చించి ప్రతిపాదనలు చేయించారు. దీంతో అగ్రహారం ఊరిలో నుంచి కాకుండా చీపురుపల్లి- రాజాం రోడ్డు నుంచి బైపాస్ రోడ్డు నిర్మాణానికి అప్పట్లోనే పనులు ప్రారంభమయ్యాయి. ఇంతలో ఎన్నికలు వచ్చినప్పటికీ గత ప్రభుత్వంలో మంజూరైన నిధులతోనే రోడ్డు పనులు పూర్తయ్యాయి. దీంతో అగ్రహారం వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కాలంగా తాము పడుతున్న కష్టాలు తీరనున్నాయని వారంతా చర్చించుకుంటున్నారు.

గత ప్రభుత్వంలోనే మోక్షం



జి.అగ్రహారం ఊరిలో నుంచి భారీవాహన రాకపోకలు నిషేధించి బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలన్న ప్రజల విజ్ఞప్తి మేరకు గత ప్రభుత్వంలోనే బైపాస్ రోడ్డుకు మోక్షం లభించింది. గత ప్రభుత్వంలోనే నిధులు మంజూరవ్వడం, పనులు ప్రారంభమవ్వడం జరిగింది. ఇంతలో ఎన్నికలు జరగడంతో పనులు నిలిచిపోయాయి. తర్వాత మళ్లీ పనులు ప్రారంభయ్యాయి. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ చొరవతోనే అగ్రహారానికి బైపాస్ రోడ్డు వచ్చింది.

– కొసిరెడ్డి రమణ, జి.అగ్రహారం

గిరిజనుల ఆందోళన



తమ గ్రామాల మీదుగా రోడ్డు నిర్మాణానికి సర్వే చేయాలంటూ గాదెల్లోవ, గూనపాడు గ్రామాల గిరిజనులు మంగళవారం ఆందోళన చేశారు. ఆరెండు గ్రామాల గిరిజనులు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో మూలబొడ్డవర పంచాయతీ పరిధిలోని బొడ్డవర నుంచి చిట్టంపాడు వరకు మంజూరైన రోడ్డు నిర్మాణం కోసం ఫారెస్ట్, ఇంజినీరింగ్ అధికారులు సర్వే ప్రారంభించారన్నారు. అయితే తమ గ్రామాల మీదుగా కాకుండా గ్రామాలు లేని కొండ ప్రాంతం నుంచి రోడ్డు వేసేందుకు అధికారులు సర్వే చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాలకు మళ్లీ ప్రత్యేకంగా రోడ్డు వేయడమంటే జరిగే పని కాదని, ఇప్పుడే రోడ్డు వేయాలని కోరారు. గిరిజనులు ఎస్.సీత, పోలయ్య, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

– శృంగవరపుకోట

అవగాహనతోనే క్షయ అంతం



అవగాహనతో క్షయ(టీబీ) వ్యాధిని అంతం చేయవచ్చని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ అన్నారు. వీరభద్రపురంలో గ్రామస్తులకు క్షయ వ్యాధి లక్షణా లు, వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు,ఆకలి మందగిం చడం,బరువు తగ్గడం,జ్వరం, చాతిలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం టీబీ నియంత్రణకు కృషి చేస్తామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. వైద్య సిబ్బంది సత్యారావు, అనుషారాణి, సత్యవతి, గ్రామపెద్ద గేదెల త్రినాథమూర్తి,తదితరులు పాల్గొన్నారు.

– కొత్తవలస

ఆకట్టుకున్న ఎడ్లపరుగు ప్రదర్శన



రాయుడుపేటలో గ్రామదేవత బంగారమ్మ తీర్థమహోత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఆకట్టుకుంది. పోటీల్లో వల్లంపూడికి చెందిన ఏడువాక సత్తిబాబు ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచి రూ.10 వేల నగదు బహుమతి గెలుచుకున్నాయి.వావిలపాడుకు చెందిన ఎడ్లు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.8వేలు, దేవరాపల్లి ఎడ్లు తృతీయ స్థానంలో నిలిచి రూ.6 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన కిత్తన్నపేట ఎడ్లకు రూ. 4వేల నగదు బహుమతిని గ్రామపెద్దలు,ఉత్సవకమిటీ సభ్యులు అందజేశారు.

– వేపాడ

పూత దశలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పేరిపి పరిసరాల్లో మామిడి పంటను పరిశీలిస్తున్న హెచ్ఓ చంద్రశేఖర్

చీపురుపల్లి/మెరకముడిదాం: మామిడి పంట ప్రస్తుతం పూతదశలో ఉందని, రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవనశాఖాధికారి సీహెచ్.చంద్రశేఖర్ సూచించారు. చీపురుపల్లి మండలంలోని పేరిపి, మెరకముడిదాం మండలంలోని సాతాంవలసలో మంగళవారం మామిడి తోటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరకముడిదాం, చీపురుపల్లి, గరివిడి మండలాల్లో 10,834 హెక్టార్లలో మామిడిపంట సాగులో ఉందని, సుమారు 8,500 హెక్టార్లలో పంట పూతదశకు వచ్చినట్లు గుర్తించామని తెలి పారు. పనుకులు, సువర్ణరేఖ రకాలు పచ్చిపూత, తెల్లపూత దశలో, అలాగే బంగినపల్లి, చెరుకు రసాలు మొగ్గ, పచ్చిపూత దశలో ఆశాజనకంగా ఉన్నాయని చెప్పారు. వర్షాలు కురవడం, తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవ్వడంతో తెల్ల పూతదశలో ఉన్న పంటకు కొంత మేర నష్టం వాటిల్లిందన్నారు. ప్రతికూల వాతావరణం వల్ల ఆంత్రాక్నోజ్, బూజు తెగులు రావ డానికి అవకాశం ఉందని, పచ్చిపూత దశలో ఉన్న తోటలకు ఇమిడాక్లోప్రిడ్ 0.5 మిల్లీలీటర్లు, హెక్సాకొన జోల్ 1.5 మిల్లీ లీటర్లు లేదా 5గ్రాముల సాఫ్ మందును లీటరు నీటి లో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. తెల్లపూత దశలో ఉన్న తోటలకు ఎలాంటి మందులు పిచికారీ చేయవద్దని చెప్పారు.

అపరాల సాగుపై అవగాహన



గరుడుబిల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మల్లికార్జునరావు

బొండపల్లి: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అపరాల సాగులో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలపై గరుడుబిల్లి, వేంద్రాం గ్రామాల్లో రైతులకు ఏఓ పి.వి.మల్లికార్జునరావు మంగళవారం అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో అపరాల పంటలను పరిశీలిం చి రైతులకు సూచనలు చేశారు. ప్రస్తుతం పంట పూత ,పిందె దశలో ఉందని, తేనె మంచు పురుగు, ఇతర తెగుళ్ల సోకే అవకాశం ఉందన్నారు. తెగుళ్ల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు. ఏఈఓ సంతోష్‌కుమార్,గరుడుబిల్లి వీపీఏ అప్పలనాయుడు పాల్గొన్నారు.

బిళ్లలవలసలో ఇంటింట సర్వే

- కొత్తగా డయేరియా కేసులు నమోదు కాలేదన్న వైద్యులు



గ్రామంలో కొనసాగుతున్న వైద్య శిబిరం



ఇంటింట సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

బొండపల్లి: మండలంలోని బిళ్లలవలస గ్రామంలో గత మూడు రోజుల వ్యవధిలో 16 మంది డయేరియా బారినపడి వివిధ ఆస్పత్రుల్లో, గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో చికిత్స తీసుకుంటున్న సంగతి తెలిసిందే. దీంతో వైద్యారోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామంలో వైద్య శిబిరాన్ని కొనసాగించడంతో పాటు మంగళవారం ఇంటింట సర్వే చేసి, అతిసారం లక్షణాలతో ఎవరైనా బాధపడుతున్నారా అని ఆరా తీశారు. కొత్త కేసులు నమోదు కాకపోవడం తో గ్రామస్తులు, వైద్య సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.డయేరియా లక్షణాలతో బాధపడుతున్న రోగుల్లో ఇంటి వద్ద ఉన్న వారితో పాటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారంతా పూర్తిగా కోలుకున్నారని బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో సచివాలయం వద్ద ఇద్దరు వైద్యులతో పాటు వైద్య సహాయకులతో వైద్యశిబిరాన్ని కొనసాగిస్తున్నామని, గ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యాధికారి చెప్పారు.

ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి



బిళ్లలవలసలో రోడ్డుపక్కన పారబోసిన చెత్తను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

బొండపల్లి: ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత పాలకులతో పాటు అధికారులపై ఉందని, ప్రభుత్వం ప్రజారోగ్యంపై దృష్టిసారించాలని సీపీ ఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారా యణ అన్నారు. బిళ్లలవలసలో 16మంది డయేరియా బారినపడడంతో ఆ గ్రామంలో సీపీఎం నాయకులు మంగళవారం పర్యటించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి అక్కడి వైద్యసిబ్బందితో మాట్లాడారు. రోగు ల ఆరోగ్య పరిస్థితితో పాటు కొత్తగా ఏమైనా కేసులు నమోదయ్యాయా అని వైద్య సిబ్బందిని ఆరా తీశారు.అనంతరం రోగుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామం లో ని తాగునీటి పథకాలతో పాటు, మురుగునీటి కాలువలను పరిశీలించా రు. గ్రామంలో అతిసారం ప్రబలడానికి కలుషిత ఆహారం తినడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణా లోపమే ప్రధాన కారణాలుగా తెలుస్తోందని, సంబంధిత అధికారులు పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలని సూచించారు.సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గొర్లె శ్రీనివాసరావు, వి.లక్ష్మి, నాయకులు రాకోటి రాములు, తొత్తడి పైడిపు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

జీఓ నంబర్ 117ను సవరించి విద్యాశాఖను బలోపేతం చేయాలని ఉపాధ్యాయులు కోరారు. చీపురుపల్లి, గంట్యాడ, కొత్తవలస,ఎల్.కోట, దత్తిరాజేరు, ఎస్. కోట, వేపాడ మండలాల్లోని మండల విద్యావనరుల కేంద్రాల ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మంగళవా రం నిరసన తెలిపారు. ఈసందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ యూపీ స్కూళ్లను యథాతథంగా ఉంచి సబ్జెక్టు టీచర్స్‌ను కొనసాగించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియం రెండూ అమలు చేయాలని కోరారు. ప్రతీ గ్రామ పంచాయతీకు ఒక మోడల్ ప్రాథమిక పాఠశాల ఉండాల న్నారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులు ఉండాలని, ఫౌండేషన్ పాఠశాలల పేరిట ప్రాథమిక పాఠశాలలను ముక్కలు చేయాలనే ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. అనంతరం ఎంఈఓలకు వినతిపత్రాలు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లి: ఎంఈఓ బూసినాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు



కొత్తవలస: మండల విద్యావనరుల కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



వేపాడ: ఎంఈఓ బాలభాస్కరరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు



గంట్యాడ: ఎంఈఓ విజయకుమారికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు



లక్కవరపుకోట: ఎంఈఓలు కూర్మారావు, శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు



శృంగవరపుకోట : ఎస్.కోటలో ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఘనంగా సీతారాముల తీర్థం



సీతారాములకు పూజలు చేస్తున్న అర్చకుడు



వాలీబాల్ పోటీల్లో విజేతగా నిలిచిన గుల్లేపల్లి జట్టుతో ఎంపీపీ గొపమ్మ,సర్పంచ్ రామస్వామి

కొత్తవలస: స్థానిక మేజర్ పంచాయతీ పరిధి కుమ్మరివీధిలో సీతారాముల తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహిం చారు. సీతారామలక్ష్మణులకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చిసీతారాములను దర్శించుకున్నారు. తీర్థం సందర్భంగా కొత్తవలస మూడు రోడ్లు జంక్షన్ నుంచి ట్రాఫిక్‌ను మళ్లించడంతో వాహనచోదకులు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

వాలీబాల్ పోటీలు

తీర్థం సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో అనకాపల్లి జిల్లాలోని గుల్లేపల్లి గ్రామ జట్టు విజేతగా నిలిచింది. విజేత, రన్న రప్ జట్లకు ఎంపీపీ ఎస్.గోపమ్మ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ రామస్వామి, మాజీ ఎంపీపీ గొరపల్లి శివ నగ దు బహుమతులు అందజేశారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

శ్మశాన వాటికలో తుప్పల తొలగింపు

గుర్ల: మండలంలోని పాలవలస శ్మశాన వాటికలో మంగళవారం తుప్పల తొలగింపు పనులు చేశారు. శ్మశాన వాటికలో తుప్పలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో గ్రామంలో ఎవరైనా మృతిచెందితే అంత్యక్రియలు చేసేందుకు గ్రామస్తులు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. సమస్యను తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పాట్నూరు సన్యాసినాయుడు జేసీబీతో తుప్పల తొలగింపు పనులను చేయించారు.



జేసీబీతో తుప్పల తొలగింపు పనులు

గ్రామాల్లో పశువైద్యశిబిరాలు



లక్కవరపుకోట: కళ్లేపల్లిలో పాడిరైతులకు సూచనలు చేస్తున్న ఏడీ గంగాధర్



గుర్ల: పాడిరైతులక మందులు అందజేస్తున్న పశు వైద్యాధికారులు, స్థానిక నాయకులు



బొండపల్లి: కొండకిండాంలో మేకలకు మందులు వేస్తున్న రాచకిండాం పశువైద్యాధికారి లక్ష్మీదీపిక



చీపురుపల్లి: పి.కె.పాలవలసలో నట్టల నివారణ మందు వేస్తున్న ఏడీ శారద

జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈశిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీలుబి.గంగాధర్, శారద, పశువైద్యాధికారులు సూచించారు. పశువులకు సాధారణ వైద్య పరీక్షలతో పాటు గర్భకోశవ్యాధి పరీక్షలు చేసి నట్టల నివారణ మందులు వేశారు. గొర్రెలకు షీప్ పాక్స్, మేకలకు గోట్ పాక్స్ వ్యాక్సిన్ వేశారు.

– గజపతినగరం/చీపురుపల్లి/లక్కవరపుకోట/గుర్ల/దత్తిరాజేరు



గజపతినగరం: కొత్తబగ్గాంలో లేగ దూడకు నట్టల నివారణ మందు వేస్తున్న వైద్య సిబ్బంది